ప్రాణాంతక రేబిస్‌పై అప్రమత్తం

- గ్రామాల్లో జూనోసిస్ దినోత్సవం
- పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్
- జునోటిక్ వ్యాధులపై అవగాహన

అనంతగిరి: మూగజీవాలకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని పశు వైద్య కేంద్రాల్లో ఉచితంగా శిబిరాలు నిర్వహించారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు, పశు సంవర్ధక శాఖాధికారులు, వైద్యులు తదితరులు మాట్లాడుతూ మూగజీవాల నుంచి మనుషులకు సుమారు వందకు పైగా వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నట్టు తెలిపారు. జంతువుల వలన మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్ అంటారన్నారు. జూనోసిస్ వ్యాధులైన రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులపై పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కల్పించారు. పలు సూచనలు చేశారు. జూనోటిక్ వ్యాధులలో రేబిస్ చాలా ముఖ్యమైందన్నారు. రేబిస్ వ్యాధి కుక్కల నుంచి మనుషులకు వస్తుందన్నారు. పెంపుడు కుక్కలను, వీధి కుక్కలు కరిచినా వాటి నోటి నుంచి వచ్చే లాలాజలం తగిలిన వ్యాధి సోకుతుందన్నారు. పెంపుడు కుక్కలకు సోకే రేబిస్ వ్యాధి ప్రాణాంతకమన్నారు. దీంతో మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని హెచ్చరించారు. పెంపుడు కుక్కలకు తరచూ రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.


కాశీపట్నంలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది


హుకుంపేటలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు


పెదబయలులో కుక్కకు టీకాలు వేస్తున్న ఏడీ, వైద్యాధికారి తదితరులు


ముంచంగిపుట్టులో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి


అడ్డతీగలలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి తరుణ్, సిబ్బంది


వై.రామవరంలో కుక్కలకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర, సిబ్బంది

అనంతగిరి మండలంలోని 224 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేసినట్టు పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు చెప్పారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని జరిగిన కార్యక్రమంలో జేడీ నరసింహులు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని 88 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసినట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ రాజ రవికుమార్ తెలిపారు. డాక్టర్లు ఎం.సౌజన్యదేవి, వరలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సుమారు 116 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్టు పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి చెప్పారు. జేవీవో యమున, ఎల్ఎస్ ధర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంతో పాటు జడ్డంగి, లాగరాయి పశువుల ఆస్పత్రుల్లో నిర్వహించిన శిబిరాల్లో 200 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసినట్టు వెటర్నరీ డాక్టర్ తరుణ్ చెప్పారు. ఎల్ఎస్ఏ లక్ష్మణరావు, వెటర్నరీ అసిస్టెంట్లు యేసుబాబు, రమణమ్మ, సుబ్బరాజు, వెంకటేష్, రవికుమార్, వీరబాబు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని 127 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసినట్టు ఇన్‌చార్జి పశు వైద్యాధికారి తరుణ్ చెప్పారు. పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని 69 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్టు పశువైద్యాధికారి యూ.వీరేంద్ర తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ జయంతి వేడుకలు రేపు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో సోమవారం దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కల్తీ వస్తువులు విక్రయిస్తే చర్యలు


సంతలో కల్తీ వస్తువులను పరిశీలిస్తున్న వినియోగదారుల సంఘం నాయకులు

హుకుంపేట: వారపు సంతల్లో కల్తీ వస్తువులు, కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వినియోగదారుల సంఘ మండల అధ్యక్షుడు బైరగ మజ్జి చెప్పారు. మండల కేంద్రంలోని వారపు సంతల్లోని దుకాణలను ఆయన శనివారం పరిశీలించారు. దుకాణాల్లో విక్రయిస్తున్న కల్తీ వస్తువులు, ఖైనీ, గుట్కా, నాసిరకం వంటనూనెను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శి సాగర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గిరిజన ప్రాంతాల్లో వారపు సంతల్లో కల్తీ వస్తువులు అధికంగా విక్రయాలు నిర్వహిస్తున్నారని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఒడిశా ప్రాంతం నుంచి అధికంగా మాదక ద్రవ్యాలు వస్తున్నాయని వీటిని అరికట్టాలన్నారు. సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, వినియోగ దారుల సంఘ సభ్యులు ప్రసన్నకుమార్, పరమేశ్వరి, శివప్రసాద్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి


ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి చెప్పారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. దీంతో పాటు దోమల వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఫాగింగ్ తదితర పనులు చేయాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


చిన్నంపాలెంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు సాయిరతన్, నిహిత

గంగవరం : పాఠశాలల్లో బాల బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ అన్నారు. పిడతమామిడి పిహెచ్‌సీ పరిధిలోని సీహెచ్.నెల్లిపూడి, పి.నెల్లిపూడి, చిన్నంపాలెం ఎంపీపీ పాఠశాలల్లో వైద్య శిబిరాలను శనివారం నిర్వహించారు. బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలను వైద్యాధికారి సాయిరతన్, డాక్టర్ నిహిత నిర్వహించారు. హెచ్ఎం మడకం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ బాలరాజు కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడు బాలరాజు కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ఆటో డ్రైవర్లు

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయితీ ముల్లుమెట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కిల్లో బాలరాజు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ సందర్భంగా స్థానిక ఆటో యూనియన్ సభ్యులంతా కలిసి మృతుడు బాలరాజు కుటుంబానికి ఆర్థిక సాయమందించారు. ఈ సందర్భంగా యునియన్ సభ్యులు మాట్లాడుతూ ఆటో నడుపుతూ అనేక ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు సంఘం తరఫున సాయమందిస్తున్నట్టు చెప్పారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి


పాఠశాలలో సమస్యపై ఎమ్మెల్యేకి వినతిపత్రాన్ని అందజేస్తున్న యువసేన యువకులు

గంగవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఎమ్మెల్యే శిరీషాదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక యువసేన నాయకులు, పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలలో సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించి, బడిని అభివృద్ధి చేయాలని వినతిలో కోరారు. సిద్దూ, అనిల్, శివ, స్వామి తదితరులున్నారు.

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషాదేవి రైతులకు కొబ్బరి తదితర మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, నాయకులు పెద్దిరాజు, భాస్కర్, తాతారావు, సావిత్రి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఏపీఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి


వైస్ ఎంపీపీ మంగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ముంపు ప్రాంత బాధితులు

ఎటపాక: మండలంలోని గౌరీదేవిపేట, మురుమూరు పంచాయతీల్లోని లోతట్టు ప్రాంతాల్లో వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, ఎంఈవో రాజులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు చెప్పారు. ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరదల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. గన్నేరుకొయ్యపాడు గ్రామస్తులు తమ ప్రాంతాన్ని పోలవరం ముంపు గ్రామంగా గుర్తించి పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరుతూ వారికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ శివకనకరాజు, వీఆర్వో కన్నమ్మ, మహిళా పోలీస్ ఇందు తదితరులున్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

జి.మాడుగుల: వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు తెలిపారు. మండలంలోని నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం వినియోగదారుల చట్టాలు, హక్కుల పరిరక్షణకు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన, పరిజ్ఞానం అవసరమన్నారు. దీని వల్ల వినియోగదారులు ఏ విధంగానూ నష్టపోయే అవకాశాలుండవన్నారు. హెచ్ఎం బి.రూపవతి, క్లబ్ ఇన్‌చార్జి గీత, జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధులు రమేష్, బాలరాజు, మాలంనాయుడు, శ్రీను, చిన్నారావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కార్మికులను ఆదుకోవాలి


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సంఘం నేతలు

ఎటపాక: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వీరాయిగూడెం, నందిగామ, రాఘవాపురం గ్రామాల్లో రైతులు, కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు వంద రోజులు పూర్తయ్యాయని, వర్షా కాలం మూడునెలలు కూలీ పనులు ఉండవని వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని నేతలకు కూలీలు వివరించారు. గతంలో భూసేకరణకు తమ భూములు ఇచ్చామని ఇప్పుడు వ్యవసాయానికి బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదని నందిగామ రైతులు తెలిపారు. చట్టప్రకారం ముంపులో ఉన్న తమ గ్రామానికి పోలవరం ప్యాకేజి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రైతులు చెప్పారు. రైతులు, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెప్పారు. సీపీఎం నాయకులు ఐవి, బాలకృష్ణ, హుస్సేన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు చిన్నయ్యపడాల్, సత్యనారాయణ

గూడెంకొత్తవీధి: మండలంలోని ముల్లుమెట్ట గ్రామంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్, నాయకులతో కలిసి శనివారం పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందని, దీనిపై నిరంతర పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 10న దేశవ్యాప్త కోర్కెల దినోత్సవం సందర్భంగా కార్మికులంతా తమ డిమాండ్లతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణతో వేలాది మంది కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిరంతర పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, అప్పలనర్స, అంగన్‌వాడీ సంఘం నాయకులు సత్యవతి, వెంకటి, రామజ్యోతి, మీనాక్షి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

గూడెంకొత్తవీధి: మన్యంలో గంజాయి సాగు, అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి అన్నారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు. మన్యంలోని గంజాయికి సంబంధించిన సమాచారాన్ని చేర వేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేకంగా 9381123100 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచిందన్నారు. ఎవరైనా గంజాయి సాగు, రవాణాకు సంబంధించి ఈ నంబరుకు సమాచారాన్ని ఇవ్వొచ్చన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వాహనం ఢీకొని దుక్కిటెద్దు మృతి


పనసలపాలెం రహదారిపై వాహనం ఢీకొని మృతి చెందిన ఎద్దు

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని దుక్కుటెద్దు మృతి చెందింది. ప్రస్తుత పంటలు వేసే సమయంలో దుక్కిటెద్దుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. రైతులు పాడి పశువులను సాగు పనుల్లో ప్రస్తుతం ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ దుక్కిటెద్దు పనసలపాలెం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఉండగా ఓ వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెంది ఉండొచ్చని పలువురు చెబుతున్నారు. దుక్కిటెద్దు విలువ మార్కెట్‌లో సుమారు రూ.25వేలకు పైగా ఉండొవచ్చని చెబుతున్నారు. ఈ పశువు ఎవరిదో తెలియరాలేదు.

కూలిన కల్వర్టుతో రాకపోకలకు ఇక్కట్లు


పనస గ్రామంలో కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన కల్వర్టును బాగు చేయాలని సర్పంచ్ కిరసాని మిల్కి కోరారు. కోతకు గురైన కల్వర్టును శనివారం సర్పంచ్ మిల్కి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మిల్కి మాట్లాడుతూ పనస కల్వర్టు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకులకు ఆటంకం ఏర్పడిందని,రెండు వైపులా కల్వర్టు పాడైపోవడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, అదే విధంగా పనస నుంచి మొక్కపుట్టు వరకు రూ.36లక్షలతో నూతన రహదారి మంజూరై పనులు మొదలుపెట్టినా నేటికి పూర్తి కాకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల ఈ ప్రాంతంలో వాహనచోదకులు రాకపోకలకు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకొని పంచాయితీ రాజ్ అధికారులు వెంటనే స్పందించి, అసంపూర్తిగా వదిలేసిన బిటి రోడ్డును పూర్తి చేయాలన్నారు. కల్వర్టును బాగు చేసి, రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆమె కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు నీలకంఠం, బుద్ధు తదితరులున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మండలంలో పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. మండలంలో గెంజిగడ్డ ప్రభుత్వ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. 5వ తరగతి విద్యార్థులకు తెలుగు సబ్జెక్టులో రాయడం, చదవడం సరిగా రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం తన కార్యాలయంలో వీఆర్వోలు, వీఎస్‌లతో సమావేశం ఏర్పాటు చేసి మీకోసం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోని వాటిపై నివేదిక ఇవ్వాలని సూచించారు.

40 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు

హుకుంపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో 40 మందికి గిరిజనులకు కుటుంబ సంక్షమ శస్త్ర చికిత్సలను శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతికుమారి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుటుంబ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మోహన్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ అధికారి కోడా మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


నీలంపుట్టులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యమని, గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని బారమసి పంచాయతీ నీలంపుట్టు గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు.ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ నిధులు రూ.4లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే మత్స్యలింగంను స్థానికులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు లకే రూపదేవి, సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు పాంగి అనిల్, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు


ముంచంగిపుట్టులో వైఎస్సార్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఈ నెల 8వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు చెప్పారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు రంగులు వేస్తూ, పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ వైఎస్సార్ జయంతికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు,అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు సన్యాసిరావు, తిరుపతి, పులిరాజు, రాజారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రరావు

కొయ్యూరు: పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అంతాడ సర్పంచ్ సుర్ల చంద్రరావు అధికారులను కోరారు.అంతాడలో శనివారం ప్రధాని ఆవాస యోజన మోడల్ అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, అధికారులు డాక్టర్ మల్లికార్జున నాయక్, స్వచ్ఛంద సంస్థ నవనిర్మాణ సమితికి చెందిన వి.కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు మాట్లాడుతూ మండల కేంద్రంలో డీఆర్ డిపో కొత్త భవనం మంజూరు చేయాలని, ఆర్‌వో ఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని, సబ్ సెంటర్‌కు విద్యుత్ సరఫరా కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని, ఎద్దుమామిడి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, తాటిమానిపాలెంకు రోడ్డు, వంతెన నిర్మాణంతో పాటు కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. ఎంపీటీసీ సత్యవేణి, ఉప సర్పంచ్ ఉల్లి రాజులమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో ఆషాఢ శుద్ధ పాడ్యమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని వజ్ర కవచాలంకృతులను చేసి పూలు, తులసి మాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.